సాక్షి ప్రకాశం

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



ఇద్దరు యువకుల దుర్మరణం

బైకును లారీ ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన యర్రగొండపాలెంలో శనివారం రాత్రి జరిగింది.

- 8లో..



చదువుకు హైవే టెన్షన్

గుండ్లాపల్లి జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం ఆ మార్గంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రిపూట చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

డీఈఓగా బాధ్యతలు చేపట్టిన కిరణ్ కుమార్



కలెకర్ తమీమ్ అన్సారియాకు మొక్క అందజేస్తున్న డీఈఓ కిరణ్‌కుమార్

ఒంగోలు సిటీ: జిల్లా నూతన డీఈఓగా ఏ.కిరణ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అంతకుముందు గుంటూరు జిల్లా బోయపాలెం డైట్ కాలేజీలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తూ ప్రకాశం జిల్లాకు డీఈఓగా బదిలీ అయ్యారు. గతంలో తాడికొండ, గుంటూరు లలో మండల విద్యాశాఖాధికారిగా పనిచేశారు. సర్వశిక్షా అభియాన్ లో ఏఎంఓగా, నర్సరావుపేట, పర్చూరులలో ఉపవిద్యాశాఖాధికారిగా, మైనంపాడు డైట్ కాలేజీలో పనిచేశారు. డీఈఓ గా కిరణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన అనంతం కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

అభ్యంతరాలుంటే ఆధారాలతో తెలపండి

ఒంగోలు సిటీ: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులకు సంబంధించిన మెరిట్‌లిస్ట్‌ను prakasam.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచారని, అభ్యంతరాలున్న వారు తగిన ఆధారాలతో సమగ్రశిక్ష కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ ఏ.కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలున్నవారు 27 నుంచి 28వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలలోపు సమగ్రశిక్ష కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ కోరారు.

శానిటరీ వర్కర్ విధుల్లోకి..

సాక్షి ఎఫెక్ట్..

కంభం: మండలంలోని చిన్న కంభం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటరీ వర్కర్ గుర్రం భాగ్యం వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలన్న నెపంతో టీడీపీ నాయకులు పట్టుబట్టి తొలగించిన నేపథ్యంలో "సాక్షి"లో 'బడుగు జీవిపై పచ్చక్షక్ష'శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. భాగ్యంను తిరిగి శనివారం విధుల్లోకి తీసుకున్నారు. తనను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విధులకు హాజరు కావాలని చెప్పారని బాధితురాలు తెలిపింది.

స్వయం సహాయక సంఘాలను పటిష్ట పరచాలి

- మెప్మా పీడీ తేళ్ల రవి కుమార్



మాట్లాడుతున్న మెప్మా పీడీ తేళ్ల రవి కుమార్

ఒంగోలు సబర్బన్: స్వయం సహాయక సంఘాలను పటిష్ట పరచాల్సిన అవసరం ఉందని జిల్లా మెప్మా పీడీ తేళ్ల రవి కుమార్ అన్నారు. స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని మెప్మా కార్యాలయంలో శనివారం ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని స్లమ్ సమైఖ్య రిసోర్స్ పర్సన్లు, నగరంలోని 3 టీఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలను పటిష్ట పరిచేందుకు రిసోర్స్ పర్సన్స్ కృషి చేయాలన్నారు. సంఘాల సమావేశాలకు హాజరై నిరంతర పర్యవేక్షణ, ఫెసిలిటేషన్ సహకారం అందించాలన్నారు. సంఘాల ఆర్థిక లావాదేవీలన్నీ మెప్మా సూచనల మేరకు పుస్తకాలు నిర్వహించాలన్నారు. ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని రిసోర్స్ పర్సన్స్‌కు మూడు విడతలుగా శిక్షణతో పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీవీ ఫణి కుమారి, ఎన్.జయకుమార్, కే.రాణి, డి.సంతోష్ కుమార్, సిటీ మిషన్ మేనేజర్ జి.కల్పనతో పాటు కార్పొరేషన్ కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

4 నుంచి సెల్‌ఫోన్ రిపేర్ పై ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: ఒంగోలు రూడ్‌సెట్ సంస్థలో సెల్‌ఫోన్ రిపేర్ పై నవంబర్ 4వ తేదీ నుంచి ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ డైరక్టర్ పీ శ్రీనివాస రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో దరఖాస్తు చేయాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి కల్పిస్తారన్నారు. ఇతర పూర్తి వివరాలకు అభ్యర్థులు 94925 83484 అనే నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అక్రమాలకు సై..

తప్పుడు స్టాంపు పేపర్లు సృష్టించడం.. తప్పుడు తేదీలతో తయారు చేయడం.. కృత్రిమ కొరతతో అధిక ధరలకు విక్రయించడం..ఇటువంటి అక్రమాలకు చెక్ పెడుతూ పూర్తి పారదర్శకత ఉండేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఈ–స్టాంప్ విధానాన్ని తీసుకొచ్చింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కార్ దీనికి మంగళం పాడేసింది. "అశ్వత్థామ హతః కుంజరః" అని కురుక్షేత్ర రణరంగంలో ధర్మరాజు పలికినట్లు...గుట్టు చప్పుడు కాకుండా నాన్ జ్యుడీషియరీ స్టాంప్స్ అమలుకు శ్రీకారం చుట్టి అక్రమాలకు పచ్చ జెండా ఊపింది. నవంబర్ 1వ తేదీ నుంచి ఇది అమల్లోకి రానుంది.



- లావాదేవీల్లో పారదర్శకత కోసం ఈ స్టాంప్ విధానాన్ని తీసుకొచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- అక్రమాలకు చెక్‌పెడుతూ ముందు చూపుతో అప్పటి సీఎం వైఎస్ జగన్ ఈ–స్టాంపింగ్ విధానం అమలు
- చంద్రబాబు అధికారంలోకి రాగానే ఈ–స్టాంపింగ్ విధానానికి మంగళం
- పాత పద్ధతిలోనే నాన్ జ్యుడీషియరీ స్టాంప్స్ తిరిగి ప్రవేశపెడుతున్న వైనం
- స్టాంప్‌లు కొరతతో జిల్లాలో మందగించిన రిజిస్ట్రేషన్స్
- నవంబర్ 1 నుంచి అమల్లోకి

ఒంగోలు సబర్బన్/మార్కాపురం:

దేశంలోనే అతిపెద్ద కుంభకోణం తెల్గీ స్టాంపుల కుంభ కోణం. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కూడా ఆ మూలాలు అప్పట్లో బయట పడి కొందరు స్టాంప్ వెండర్లు జైళ్లకు కూడా వెళ్లారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ తయారు చేసిన స్టాంపులకు బదులుగా అదేవిధమైన స్టాంపులు రూ.100 నుంచి రూ.10 వేల స్టాంపులు కూడా తయారు చేసి దేశ ఆర్థిక వ్యవస్థకే సవాలు విసిరాడు తెల్గీ. దాంతో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం కూడా అప్పటి నుంచి ఎన్నో సాంకేతికపరమైన జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చారు. అయినా అక్రమాలు చేయటానికి ఆ కోవలో ఉండే వాళ్లు ఏదోఒక మార్గాన్ని ఎంచుకుంటూనే వస్తుంటారు.

పారదర్శకంగా ఈ–స్టాంపింగ్:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగంలో అప్పటి వరకు ఉన్న నాన్ జ్యుడీషియరీ స్టాంప్స్ విధానంపై ఉన్నతాధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ విధానంపై కూడా ఆ కమిటీతో అధ్యయనం చేయించారు. ఆ కమిటీ నివేదిక ఆధారం చేసుకొని నాన్ జ్యుడీషియరీ స్టాంప్స్ స్థానంలో పారదర్శకంగా ఉండేలా ఈ–స్టాంపింగ్ విధానాన్ని అమలు చేశారు. ఎంతో ముందు చూపుతో ఈ పారదర్శక విధానాన్ని అమలు చేస్తూ వచ్చారు. ఆ తరువాత సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, సచివాలయాల కార్యదర్శులకు సబ్ రిజిస్ట్రార్ హోదా కల్పించి ఏ గ్రామంలో రిజిస్ట్రేషన్లు ఆ గ్రామంలోనే ప్రజలు చేసుకునే విధానానికి కూడా శ్రీకారం చుట్టారు.

దాంతో రోజుల తరబడి రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగటం పోతుందని, సమయం కూడా వృథా కాకుండా సత్వరం పని పూర్తవుతుందని భావించారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు కూడా తిలోదకాలిచ్చాడు. తాజాగా ఈ స్టాంప్స్ విధానానికి మంగళం పాడేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.10, రూ.20 స్టాంపులు విడుదల...

అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ–స్టాంపింగ్ విధానాన్ని అమలులోకి తెచ్చిన తరువాత ప్రజల చిన్న చిన్న అవసరాలు తీర్చేందుకు నాన్ జ్యుడీషియరీ స్టాంపులు రూ.10, రూ.20 విలువ కలిగినవి మాత్రమే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తరువాత వాటిని కూడా ప్రజలకు సరిపడా విడుదల చేయలేదు. నోటరీ చేసుకోవాలన్నా, ఎవరైనా పొలమో, స్థలమో కొనుక్కొని అగ్రిమెంట్‌లు చేసుకోవాలన్నా వాటిని వినియోగించేవారు. కొరత ఏర్పడటంతో రూ.10 స్టాంపును రూ.100కు, రూ.20 విలువైన స్టాంపును రూ.200 లకు కూడా స్టాంప్ వెండర్లు విక్రయించిన రోజులు ఉన్నాయి. దాంతో ప్రజలు బ్లాక్‌లో కొనుక్కోలేక, మరి అవసరాలకు తప్పదన్నట్లు గత్యంతరం లేక కొనుగోలు చేయాల్సిన పరిస్థితులను చంద్రబాబు ప్రభుత్వం కల్పించింది.

జిల్లాలో నకిలీ స్టాంపుల కుంభకోణం...

ఇటీవల జిల్లాలో నకిలీ స్టాంపుల కుంభకోణం కూడా ఒక కుదుపు కుదిపింది. అంటే అధికారుల డిజిగ్నేషన్‌లకు సంబంధించి రబ్బరు స్టాంపులు తయారు చేసుకొని అధికారులు ఇవ్వకుండానే పుట్టిన తేదీ సర్టిఫికెట్లు, మరణ ధ్రువీకరణ పత్రాలు తయారు చేసుకొని ఖాళీగా ఉన్న స్థలాలను నాన్ జ్యుడీషియర్ స్టాంపులను పాతవి సంపాదించి వాటితో వీలునామాలు, అగ్రిమెంట్లు సృష్టించుకొని ఎంతో మంది అమాయకుల ఆస్తులను కొల్లగొట్టారు. జిల్లాలో దాదాపు 100కు పైగా కేసులు నమోదు చేసి అనేకమందిని జైళ్లకు కూడా పంపిన విషయం అందరికీ తెలిసిందే. ఈ కేసుల్లో ఒంగోలు జాయింట్ 1 సబ్‌రిజిస్ట్రార్ రమణకుమార్, జాయింట్ 2 సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసబాబుతో పాటు గిద్దలూరు, యర్రగొండపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేసే సీనియర్ అసిస్టెంట్లు కూడా సస్పెండ్ అయ్యారు.

రూ.50, రూ.100 విలువైన స్టాంపులు వచ్చాయి

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి రూ.50, రూ.100 విలువైన నాన్ జ్యుడీషియరీ స్టాంపులు జిల్లా కార్యాలయానికి వచ్చాయి. వాటిని ఈ నెల 29వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సరఫరా చేస్తాం. ఇప్పటికే రూ.10, రూ.20 విలువైన స్టాంపులు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతానికి ఈ–స్టాంపింగ్ విధానం ద్వారానే క్రయ, విక్రయాల లావాదేవీల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ–స్టాంపింగ్ విధానాన్ని ఆపమని ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికి అయితే ఉత్తర్వులు ఏమీ రాలేదు. ప్రజలకు స్టాంపులు కొరత లేకుండా చూస్తాం.

– ఆళ్ల బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

స్టాంపుల కొరతతో అవస్థలు

జిల్లా వ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల కొరత ఏర్పడింది. దీంతో భూములు, స్థలాల కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఒంగోలు, మార్కాపురం, కంభం, గిద్దలూరు, పొదిలి, యర్రగొండపాలెం, కనిగిరి, సంతనూతలపాడు, చీమకుర్తి, దర్శి, సింగరాయకొండ, అమ్మనబ్రోలు తదితర ప్రాంతాల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో రోజుకు 250 నుంచి 300 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. సగటున జిల్లా కేంద్రం ఒంగోలులో ఉన్న జాయింట్–1, జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్ల పరిధిలో రోజుకు 50 నుంచి 60 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు చేస్తుంటారు. మార్కాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సగటున రోజుకు 25, కంభంలో 15, గిద్దలూరులో 15, పొదిలిలో 15, యర్రగొండపాలెంలో 10, కనిగిరిలో 50 నుంచి 60, సంతనూతలపాడులో 15, చీమకుర్తిలో 15, దర్శిలో సుమారు 30 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. స్టాంపుల కొరత కారణంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. అసలే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రియల్ ఎస్టేట్ రంగం మందగించింది. అమ్మేవారు ఉన్నప్పటికీ కొనేవారు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో స్టాంపుల కొరత కారణంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆశించిన స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. ఈ–స్టాంపింగ్ పేపర్లు కూడా సక్రమంగా అందుబాటులోకి రాకపోవడంతో కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వాయిదా వేసుకుంటున్నారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.





సమావేశం నిర్వహిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జూపూడి ప్రభాకర్‌రావు, టీజేఆర్ సుధాకర్‌బాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం ఒంగోలులోని పార్టీ జిల్లా కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయానికి వచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు జూపూడి ప్రభాకర్‌రావు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు, పార్టీ ముఖ్య నాయకులతో బూచేపల్లి సమావేశమై పార్టీ వ్యవహారాలపై సమీక్షించారు.

పంట నష్టంపై సర్వే

- క్షేత్ర స్థాయిలో అధికారుల పరిశీలన
- నేటితో ముగియనున్న సర్వే
- అత్యధికంగా సజ్జ పైరుకు నష్టం
- ఒక్కో రైతుకు 5 ఎకరాలకు మాత్రమే పరిమితం

కనిగిరి రూరల్: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షానికి రైతులు కుదేలయ్యారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఎక్కువ శాతం చేతికి వచ్చే పరిస్థితి లేదు. జిల్లాలో అత్యధికంగా సజ్జ పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా. 2024 ఖరీఫ్ సాగు లక్ష్యం జిల్లాలో 2,02,249 హెక్టార్లు కాగా, అందులో ఇప్పటి వరకు 1,60,017 హెక్టార్లు సాగు చేసినట్లు నివేదికలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో సజ్జ 1819 హెక్టార్లు, అలసంద 1148 హెక్టార్లు, మినుములు 925 హెక్టార్లు, జొన్న 3 హెక్టార్లు, పత్తి 25 హెక్టార్లు, వరి 80 హెక్టార్లు దెబ్బతిన్నట్లు అధికారుల ప్రాథమిక అంచనా. అందులో సజ్జ పంట అధికంగా దెబ్బతింది. కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో 20,928 హెక్టార్లు ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం కాగా, 17,627 హెక్టార్లు సాగైంది. వీటిలో ప్రధాన పంటగా కంది 5,477 హెక్టార్లు, 1,678 హెక్టార్లు సజ్జ సాగు చేశారు.

ఈనెల 27 వరకు క్షేత్ర స్థాయి సర్వే..

వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహార నివేదిక తయారుకు క్షేత్ర స్థాయిలో మూడ్రోజుల నుంచి సర్వే నిర్వహిస్తున్నట్లు ఏడీఏ ఈ వెంకటరమణ తెలిపారు. ఈ నెల 27 వరకు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి నివేదిక తయారు చేస్తారని తెలిపారు. 28 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు రైతుల ఎన్యుమరేషన్ జాబితాను ఆర్‌బీకేల వద్ద బహిరంగంగా ఉంచుతారు. 3న ప్రజా వేదిక నిర్వహించి అభ్యంతరాలు తదితర అర్జీలు తీసుకుని వాటిని పరిష్కరిస్తారు. ఫిర్యాదులో పరిశీలనలో వచ్చిన మార్పు, చేర్పులను పూర్తి చేసి, నవంబర్ 4న తుది నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేస్తారు. ఏపీ ప్రభుత్వ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం నష్ట పరిహారాన్ని నమోదు చేసి పంపిస్తారు. దానికి సంబంధించి వరి, చెరకు, కాటన్, వేరుశనగ పంటలకు హెక్టారుకు రూ.17,000, మ్యాజీకి రూ.12,500, కంది, మినుము, అలసంద, బెంగాల్ గ్రామ్, కోపి, పొద్దుతిరుగుడు, ఇతర పంటలకు రూ.10 వేలు, పొగాకుకు రూ.10 వేలు, సజ్జ, జొన్న, రాగి పంటలకు రూ.8,500, మిస్తా, జూట్, కుసుమ, కొర్రలు, వరిగలు తదితర వాటికి రూ.8,500గా నివేదికలు పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు. ఒక రైతుకు 5 ఎకరాలు మాత్రమే పంట నష్ట నమోదు చేస్తారని వెల్లడించారు.



సజ్జ పంట నష్ట సర్వే చేస్తున్న ఏడీఏ, అధికారులు

ఎన్యుమరేషన్ సర్వేను సమగ్రంగా నిర్వహించాలి



పంట నష్ట పరిహార నివేదిక తయారీకి అధికారుల బృందం నిర్వహిస్తున్న సర్వేను క్షేత్ర స్థాయిలో సమగ్రంగా చేయాలి. పంట నష్టపోయిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకూడదు. ఎటువంటి వివక్షత లేకుండా పంట నష్టం జరిగిన ప్రతి ఒక్కరి పేర్లను జాబితాలో చేర్చాలి. ప్రభుత్వం తక్షణం స్పందించి అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలి. రబీ సీజన్‌లో రైతులు మళ్లీ పంటలు సాగు చేసుకునేలా రాయితీపై విత్తనాలు, ఎరువులు, పనిముట్లు అందజేయాలి.

– గుజ్జుల బాలిరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

బాలికల వివరాలు పక్కాగా సేకరించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో 12 నుంచి 18 ఏళ్ల వయసు వరకు ఉన్న బాలికల వివరాలు పక్కాగా సేకరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాల నివారణపై జిల్లా యంత్రాంగం చేపట్టిన బంగారు బాల్యం కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో శనివారం బంగారు బాల్యం కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. 3 నుంచి 6 ఏళ్ల చిన్నారులు ఎంత మంది ఉన్నారు, వారిలో ఎంతమంది అంగన్‌వాడీల్లో ఉన్నారు, పాఠశాల వయసు పిల్లలు ఎంతమంది, వారిలో ఎంతమంది పాఠశాలలకు వెళుతున్నారు అనే అంశాలతో పాటు



బంగారుబాల్యం కార్యక్రమంపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

విద్యార్థులకు వ్యాక్సిన్ వేస్తున్న తీరు, రక్తహీనత తదితర అంశాలపై సమీక్షించారు. బాల కార్మికులుగా పని చేసి విముక్తి పొందిన పిల్లల ప్రస్తుత స్థితిగతులపై కలెక్టర్ ఆరా తీశారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ మాధురి, నోడల్ ఆఫీసర్ భగీరథి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రీదేవి, ఇమ్యునైజేషన్ ఆఫీసర్ పద్మజ, బీసీ సంక్షేమ అధికారి అంజల, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, డీసీపీవో దినేష్‌కుమార్, ఉప విద్యాధికారి సామా సుబ్బా రావు, డీఎల్‌పీవో పద్మ, సీడీపీవోలు పాల్గొన్నారు.

అపార్ ఐడీ రూపకల్పన వేగవంతం చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ రూపకల్పన ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక గ్రీవెన్స్ హాలులో శనివారం మండల విద్యాధికారులు, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల నిర్వాహకులు, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించారు. అడ్మినిస్ట్రేషన్ రిజిస్టర్, ఆధార్ కార్డు, యుడైస్‌ల్లో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ వివరాలు సరిగా ఉంటే వెంటనే అపార్ ఐడీ జనరేట్ చేయాలన్నారు. ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు డేటా మేనేజ్‌మెంట్ కోసం అపార్ ఐడీ రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. యుడైస్ లాగిన్ ఎంఈఓల ఆధ్వర్యంలో ఉందని ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులకు లాగిన్ ఇస్తే కొంత వెసులుబాటు ఉంటుందని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా విద్యార్థుల పేర్లలో మార్పులు, పుట్టిన తేదీల్లో తప్పులను సరిచేసేందుకు ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ లాగిన్ అంశాన్ని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ పంపుతామని తెలిపారు. నవంబర్ 14వ తేదీ మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ విజయవంతం చేసేందుకు ఇప్పటి నుంచి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దీనిలో జిల్లా విద్యాధికారి కిరణ్‌కుమార్, డిప్యూటీ డీఈఓలు సామా సుబ్బారావు, చంద్రమౌళీశ్వరరావు, ఆర్ఐఓ సైమన్ విక్టర్, సమగ్ర శిక్ష అభియాన్ ఏఎంఓ రమేష్, డీసీఈబీ కార్యదర్శి శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



విద్యాధికారులు, పాఠశాలల నిర్వాహకులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

వాహన్, సారధి పోర్టల్‌పై శిక్షణ

ఒంగోలు సబర్బన్: రవాణా శాఖలో వాహన్, సారధి పోర్టల్‌లో నిర్వహించాల్సిన సాంకేతికతకు సంబంధించి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం స్థానిక క్విజ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ శిక్షణకు గుంటూరు రవాణా శాఖ రీజియన్ కార్యాలయం పరిధిలోని ఐదు జిల్లాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రకాశం జిల్లాతో పాటు గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు జిల్లాలకు చెందిన మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, మినిస్టీరియల్ సిబ్బంది, ఫైనాన్సర్లు శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ కార్యక్రమానికి రవాణా శాఖ గుంటూరు రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎస్.శివరామ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రవాణా శాఖలో వాహన్, సారధి పోర్టల్‌లో ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బదిలీలు, ఫైనాన్స్ నోటింగ్ అండ్ కాన్సిలేషన్‌కు సంబంధించి మెళకువలుపై శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా ఇతర ఆన్‌లైన్ అప్లికేషన్‌కి సంబంధించి ఎన్ఐసీ టీం ప్రత్యేక శిక్షణ ఇచ్చారని వివరించారు.



మీడియాతో మాట్లాడుతున్న రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎస్.రాంప్రసాద్

కార్యక్రమంలో డీటీసీ ఆర్.సుశీల, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఏ.కిరణ్ ప్రభాకర్, కే.రామచంద్ర రావు, ఎల్ సురేంద్ర ప్రసాదు, ఎస్ జగదీష్, పరిశపోగు రవి కుమార్ (దర్శి), ఏ.మాధవరావు (మార్కాపురం), యు.ధర్మేంద్ర, కే.జయ ప్రకాష్, ఒంగోలు డీటీసీ కార్యాలయ ఏఓలు శ్రీనివాస్, సుధాకర్, ఎన్ఐసీ టీం సభ్యులు శ్రీనివాస్, గంగాధర్, సోమేష్, విశ్వ, కృష్ణ బాబుతో పాటు ఐదు జిల్లాలో రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ ఈడీగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకారం

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా నియమితులైన ఎం వెంకటేశ్వరరావు ప్రగతి భవన్‌లోని బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. వెంకటేశ్వరరావు గతంలో ఒంగోలు నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పని చేస్తూ తాడిగడప మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయి తిరిగి ఒంగోలు బీసీ కార్పొరేషన్ ఈడీగా జిల్లాకు బదిలీపై వచ్చారు. మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తదితరులను ఈడీ కలిశారు. పదవీ బాధ్యతలు చేపట్టిన ఈడీని కార్యాలయ సిబ్బంది కలిసి అభినందించారు.



వెంకటేశ్వరరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కార్యాలయ సిబ్బంది

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం లోడు లారీని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

యర్రగొండపాలెం: మండలంలోని సాయిబాబా నగర్ పొలాల్లో అక్రమార్కులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న గోడౌన్‌పై మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ దాడి చేసి 300 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత అందిన సమాచారం మేరకు.. రేషన్ బియ్యం బస్తాలను లారీలో లోడ్ చేసి తరలించటానికి సిద్ధంగా ఉంచారు. ఈ తరుణంలో సబ్ కలెక్టర్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది, ఎస్సై చౌటయ్య అక్కడికి వెళ్లడంతో నిందితులు పరారయ్యారు. పోలీసులు వెంటనే లారీని సీజ్ చేసి బియ్యం లోడును స్థానిక సీఎస్ గోడౌన్‌కు తరలించారు.

బాలికను దత్తత ఇచ్చిన కలెక్టర్



దత్తత ఇస్తున్న బాలికతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: మహిళా శిశు సంక్షేమ శాఖలో ఆశ్రయం పొందుతున్న రామకోటమ్మ అనే ఏడు సంవత్సరాల బాలికను కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం ప్రకాశం భవనంలో తాత్కాలిక ప్రాతిపదికన దత్తత ఇచ్చారు. చీరాల న్యాయస్థానంలో క్లర్క్‌గా పనిచేస్తున్న చీరాలకు చెందిన సుజిని అనే మహిళ.. బాలికను దత్తత తీసుకున్నారు. ఐసీడీఎస్ పీడీ మాధురి, డీసీపీఓ దినేష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలి



వివరాలు తెలుసుకుంటున్న అదనపు జిల్లా జడ్జి అమ్మన్న రాజా

ఒంగోలు సిటీ: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని అదనపు జిల్లా జడ్జి డి.అమ్మన్నరాజా అన్నారు. శనివారం హ్యూమన్ రైట్స్ హోదాలో అదనపు జిల్లా జడ్జి డి.అమ్మన్నరాజా బాలసదన్ (సోషల్ వెల్ఫేర్ ఉమెన్ చైల్డ్ డెవలప్‌మెంట్)ను సందర్శించారు. బాలసదన్‌లోని విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

దంత వైద్యానికి ప్రాధాన్యత పెరిగింది

- 43వ రాష్ట్ర స్థాయి డెంటల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి డోలా



జ్ఞాపికలను అందజేస్తున్న మంత్రి డోలా

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో దంత వైద్యానికి పెరుగుతున్న ప్రాధాన్యతను గుర్తెరిగి వైద్య సేవలను అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం నగరంలోని సాయి ఐటీఏ కన్వెన్షన్ హాలులో జరిగిన 43వ డెంటల్ కాన్ఫరెన్స్ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రసంగించారు. జిల్లాలో వైద్య రంగం మెరుగైన రీతిలో ముందుకు సాగుతోందన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందించాలన్నారు. సామాన్య ప్రజలకు కూడా దంత వైద్యం అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత దంత వైద్యులపై ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన సాంకేతికతకు మద్దతు ఇస్తుందని పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డి అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని దంత వైద్యుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య సేవలతో పాటు సామాజికసేవలో కూడా వైద్యులు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నారు. డాక్టర్ మండవ లావణ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయ్ కుమార్, ఆర్గనైజింగ్ చైర్మన్ ఆర్.శ్రీధర్, కాన్ఫరెన్స్ కమిటీ కార్యదర్శి డాక్టర్ రామచంద్రారెడ్డి, ఐడీఏ సెక్రటరీ బి.సుధాకర్ రాజు, ఐఎంఏ కార్యదర్శి డా.సుభాష్, వై. ప్రసాద్, అజయ్ బెనర్జీ, మురళీధర్ రెడ్డి, ఆశాలత పాల్గొన్నారు.

చదువుకు హైవే టెన్షన్



హైస్కూల్‌కు సైకిల్‌పై వెళుతున్న కీర్తిపాడు గ్రామానికి చెందిన విద్యార్థిని

- ప్రమాదకర పరిస్థితుల్లో పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు
- ఆర్టీసీ బస్సు కేటాయించడంలో ప్రభుత్వం విఫలం

సాక్షి, ఒంగోలు: చిన్నారుల భవితతో నూతన ప్రభుత్వం ఆటలాడుతోంది. ప్రభుత్వ బడులపై నమ్మకంతో కిలోమీటర్ల కొద్దీ దూరంలో ఉన్న జెడ్పీ పాఠశాలకు వస్తున్నా.. వారికి ప్రయాణ సౌకర్యాలు కల్పించడంలో ప్రేక్షక పాత్ర వహిస్తోంది. మద్దిపాడు మండలంలోని రాచవారిపాలెం, కీర్తిపాడు, గాజులపాలెం గ్రామాలకు చెందిన సుమారు 100 మందికి పైగా విద్యార్థులు గుండ్లాపల్లి (కారుమూడి వారిపాలెం) జెడ్పీ హైస్కూల్‌లో అడ్మిషన్లు పొందారు. అయితే ఆయా గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సును కేటాయించడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. హైస్కూలుకు వెళ్లాలంటే సర్వీసు రోడ్డులో వ్యతిరేక దిశలో ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇలా కొంత మంది కిక్కిరిన ఆటోల్లో ప్రమాదకరంగా వెనుక నిలబడి, డ్రైవర్ పక్కన కూర్చొని పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. అలాగే సైకిళ్లపై వచ్చేవారు.. కాలి నడకన వచ్చేవారు వ్యతిరేక దిశలో ప్రయాణం చేస్తున్నారు. మరికొంతమంది చిన్నారులైతే రోడ్డుకు ఓ వైపు నుంచి ఇటు వైపు నడుచుకుంటూ క్రాస్ చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఏవైనా ఘోర ప్రమాదాలు జరగకముందే ఆర్టీసీ అధికారులు ఉదయం.. సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యం కల్పించాలని.. లేదంటే ఎవరైనా పారిశ్రామిక వేత్తలు దాతృత్వంతో ఓ వాహనం కేటాయించాలని ఆయా గ్రామాల ప్రజలు అభ్యర్థిస్తున్నారు.



రాచవారిపాలెం గ్రామ విద్యార్థులు



కాలినడకన వస్తున్న గాజులపాలెం విద్యార్థులు





ప్రమాదకర స్థితిలో ఆటోలో ప్రయాణిస్తున్న కీర్తిపాడు, రాచవారిపాలెం, గాజులపాలెం గ్రామాలకు చెందిన విద్యార్థులు





ప్రమాదకరంగా జాతీయ రహదారి దాటుతూ..

గోవా మద్యం స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

కంభం: అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు శనివారం ఉదయం స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మార్కాపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దాసరి బాలయ్య మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. స్థానిక మధుప్రియ రెస్టారెంట్ సమీపంలోని ఓ గృహంలో అక్రమంగా నిల్వ ఉంచిన గోవా రాష్ట్రానికి చెందిన 50 ఫుల్ బాటిల్స్ లభించాయని ఆ మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఉప్పలపాటి గోపి క్రిష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బెల్టు షాపులు, మద్యం వ్యాపారుల పై ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారన్నారు. ఎక్కడైనా బెల్టు షాపులకు వేలంపాట వేసినా, దుకాణాల్లో అక్రమ మద్యం విక్రయించినా, నాటు సారా తయారు చేసినా చట్టరీత్యా నేరమన్నారు. మద్యం దుకాణాలు నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవాలని సిట్టింగ్ రూములకు ఎటువంటి అనుమతులు లేవని ఎవరైనా ఏర్పాటు చేసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని తెలిపారు. చిన్నకంభం కేంద్రంగా గత కొంతకాలంగా అక్రమ మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం తెప్పించి నిత్యం విక్రయిస్తుంటారని అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే శిక్ష

- ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరిక



వాహనాల తనిఖీ సందర్భంగా నగరంలో పర్యటించిన ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపితే చట్టపరంగా శిక్ష తప్పదని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. శనివారం నగరంలో భారీ ఎత్తున వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఇద్దరు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 40 మంది ఎస్సైలతో మొత్తం 500 మంది పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. నగరంలోని అన్ని కూడళ్లు, ప్రధాన ప్రాంతాల వద్ద మోహరించిన పోలీసులు ఉదయం 9 గంటల నుంచే రోడ్ల మీదకు చేరుకున్నారు. రాత్రి 8 గంటల వరకు వాహనాలను తనిఖీ చేశారు. 795 వాహనాలను తనిఖీ చేసి లైసెన్సులు లేని, ఇతర ధృవపత్రాలు లేని వాహనాలతోపాటు ట్రిపుల్ రైడింగ్, మాడిఫైడ్ సైలెన్సర్లు, మైనర్ రైడింగ్, నంబర్ ప్లేట్లు లేని వాహనాలకు చలానా విధించడంతో పాటు పలు వాహనాలు సీజ్ చేశారు. అలాగే 45 ఆటోలను పట్టుకున్నారు. 900 బైకులకు నెంబర్ ప్లేట్లు సరిగా కనిపించేలా ఏర్పాటు చేశారు. రెండు దొంగ బైకులను పట్టుకున్నారు.

నగరంలో పర్యటన

వాహనాల తనిఖీ జరుగుతున్న సమయంలోనే ఎస్పీ ఏఆర్ దామోదర్ నగరంలో పర్యటించారు. అద్దంకి బస్టాండు సెంటర్, కొత్తపట్నం బస్టాండు, చర్చి సెంటర్, మామిడి పాలెం, మంగమూరు జంక్షన్ ప్రాంతాల్లో పర్యటించి.. ఎన్ఫోర్స్‌మెంట్ జరుగుతున్న తీరును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. నగరంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ఒక్కటే ప్రమాదాల నివారణకు చక్కటి పరిష్కారమన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపవద్దని, మద్యం సేవించి వాహనాలను నడపడం ప్రమాదకరమని చెప్పారు. ఈ తనిఖీల్లో ఏఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, సీఐలు అజయ్ కుమార్, వై.నాగరాజు, మేడా శ్రీనివాసరావు, శ్రీకాంత్ బాబు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కష్టపడితేనే న్యాయవాదిగా గుర్తింపు

- హైకోర్టు రిటైర్డ్ జడ్జి కేజీ శంకర్



ప్రసంగిస్తున్న రిటైర్డ్ హైకోర్టు జడ్జి కేజీ శంకర్



గ్రాడ్యుయేషన్‌డేలో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు: కష్టంతోపాటు ఇష్టంగా సాధన చేస్తే న్యాయవాదిగా మంచి గుర్తింపు పొందవచ్చని హైకోర్టు రిటైర్డ్ జడ్జి కేజీ శంకర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. న్యాయవాదులుగా రాణించాలంటే అనుభవం ఉన్నవారి సలహాలు, సూచనలు పాటిస్తూ నిత్యం కోర్టులకు వెళుతూ ఉండాలన్నారు. ప్రారంభంలో కొంత అయోమయంగా ఉన్నా కొద్దిరోజులకు అవగాహన పొందుతారని, కోర్టుల్లో వ్యవహార శైలి, సహ న్యాయవాదులతో, కక్షిదారులతో ఎలా వ్యవహరించాలనే అంశాలపై నైపుణ్యం సాధించాలని సూచించారు. కాలేజీ కరస్పాండెంట్ నరశింగరావు మాట్లాడుతూ తొలిసారిగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం జరగడం ఆనందంగా ఉందన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నటరాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఆళ్ల హరిబాబు, అధ్యాపకులు సుంకర సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకుల దుర్మరణం



అఫ్రోజ్‌బేగ్ (ఫైల్)



నూర్ మహ్మద్ (ఫైల్)



సంఘటన స్థలంలో యువకుల మృతదేహాలు

యర్రగొండపాలెం: స్థానిక మార్కాపురం రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్ద మోటార్ బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. శనివారం రాత్రి షేక్ నూర్ అహ్మద్ (25), ఎం.అఫ్రోజ్ బేగ్ (20) తమ మిత్రులతో కలిసి దాబాలో డిన్నర్ చేసేందుకు వెళ్లారు. మెనూ ఆర్డర్ ఇచ్చిన తర్వాత సరదాగా ఊరి వెలుపలికి వెళ్లి వస్తామని చెప్పిన వారిద్దరూ మోటారు బైక్‌పై మార్కాపురం రోడ్డులో వెళ్తుండగా యర్రగొండపాలెం వైపు వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. నూర్ మహ్మద్ స్విమ్మింగ్ పూల్ నిర్వహిస్తున్నాడు. వచ్చే నెల 20వ తేదీన బెంగళూరులోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. అఫ్రోజ్‌బేగ్ స్థానికంగా మోటార్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. వారిద్దరి కుటుంబాల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చౌడయ్య తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



మృతుడు దుగ్గెంపుడి వెంకటరెడ్డి (ఫైల్)



మృతురాలు బలుసుపాటి అచ్చమ్మ

పెద్దారవీడు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలో బోడిరెడ్డిపల్లి గ్రామం దగ్గర శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దుగ్గెంపుడి వెంకట రెడ్డి ద్విచక్ర వాహనంపై హనుమాన్ జంక్షన్ కుంటకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో ఎంపీపీ పాఠశాల వద్ద వెనుక వైపు నుంచి ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. వెంకటరెడ్డి (54) తారు రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయం తగిలింది. స్థానికులు క్షతగాత్రున్ని ఎర్రగొండపాలెం వైద్యశాలకు తరలించారు. డాక్టర్ల సలహాల మేరకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలిస్తున్న సమయంలో మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలున్నారు. శనివారం బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్ గురై..

పెద్దారవీడు: మండలంలో ఏనుగులదిన్నెపాడు గ్రామానికి చెందిన బలుసుపాటి అచ్చమ్మ (60) ఇంటిలో విద్యుత్ షాక్ గురై శనివారం మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు.. బజారులో ఉన్న కరెంటు స్తంభం నుంచి సర్వీసు వైరు రేకుల మీదుగా ఇంటిలోకి విద్యుత్ సరఫరా కోసం తీగలు వేసుకున్నారు. సర్వీసు వైరు జాయింట్ రేకులపై అంటుకొని ఉంది. ఇది గమనించక బట్టలు ఆరేస్తున్న సమయంలో రేకుల కింద ఉన్న పైపు అచ్చమ్మ చేతులు తగులుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై కింద పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వైద్యశాలకు తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్త్రీ, పురుష బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక ఆదివారం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి సోమినేని సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషుల జట్టు ఎంపిక గుడ్లూరు మండలం చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్నం 2గంటలకు , స్త్రీల జట్టు ఎంపిక కనిగిరి మండలం గురవాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 2 గంటలకు నిర్వహిస్తారన్నారు. నవంబరు 8 నుంచి 10వ తేదీవరకు నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాలని కోరారు.

రాళ్లపాడు స్పిల్ వేకు లీకులు

- వృథాగా పోతున్న నీరు
- ఆందోళనలో రైతాంగం

లింగసముద్రం: రాళ్లపాడు స్పిల్ వే గేట్లు లీకవడంతో అంతా ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు పాత స్పిల్‌వేలో పది పెద్ద గేట్లు, రెండు బురద గేట్లు ఉన్నాయి. ఈ గేట్లు 15 సంవత్సరాల నుంచి ఎత్తక పోవడంతో తుప్పు పట్టి ఇరుక్కుపోయాయి. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్టుకు 17.3 అడుగుల మేర నీరు చేరింది. అయితే పాత స్పిల్‌వే గేట్ల ద్వారా లీకేజీ రూపంలో నీరు పోతుండటంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో వరిపంట పండలేదు. ఈ సంవత్సరం ముందుగానే వర్షాలు కురవడంతో పాటు ప్రాజెక్టుకు వరదనీరు వచ్చి 17.3 అడుగులకు చేరడంతో రైతులు నాట్లు వేసేందుకు సమాయత్తం అవుతున్నారు. అయితే లీకేజీ రూపంలో పాత స్పిల్‌వే గేట్ల ద్వారా నీరు మన్నేరుకు పోతుండటంతో వరి పంట పండుతుందా లేదా అని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిసి ప్రాజెక్టుకు 21 అడుగుల పూర్తి నీటి సామర్థ్యంతో నిండితే గానీ వరి పంట పండుతుందని రైతులు చెబుతున్నారు. సోమశిల జలాలు కూడా 300 క్యూసెక్కులకు తగ్గకుండా ప్రాజెక్టుకు చేరితే ఇబ్బంది ఉండదంటున్నారు. అధికారులు స్పందించి గేట్ల లీకేజీని అరికట్టి సోమశిల జలాలు 300 క్యూసెక్కుల మేర ప్రాజెక్టుకు చేరే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

యజమానులకు రూ.34 లక్షల టోకరా

- పెట్రోలు బంకు యాజమాన్యాన్ని మోసగించిన దంపతులు
- ఇద్దరిపై కేసు నమోదు

అద్దంకి రూరల్: నమ్మి ఉద్యోగమిచ్చిన యజమానులకే టోకరా వేశారు దంపతులు. విదేశాల్లో వ్యాపారం చేసుకునేవారు.. ఓ జంటను నమ్మి.. పెట్రోలు బంకు మేనేజర్లుగా నియమించారు. అయితే యజమానులకే రూ. 34 లక్షలు టోకరా పెట్టిన వ్యవహారంలో శనివారం సీఐ కృష్ణయ్య కేసు నమోదు చేశారు. గుంటూరులోని దేవపురానికి చెందిన జెల్ది అనిల్ కుమార్, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా సింగరేణికి చెందిన గార్లపాటి రంజిత్ కుమార్ దక్షిణాఫ్రికాలో వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. వీరిద్దరూ కలిసి అద్దంకిలోని గరటయ్య కాలనీ ఎదురుగా మూడేళ్ల క్రితం గార్లపాటి పెట్రోలియమ్స్ పేరుతో హెచ్‌పీ పెట్రోలు బంకు ఏర్పాటు చేశారు. దీనికి మేనేజర్లుగా తమకు పరిచయం ఉన్న చీమకుర్తిలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన బత్తుల వెంకటేశ్వర్లు, అతని భార్య బత్తుల మల్లేశ్వరిలను నమ్మి ఇద్దరికీ.. నెలకు రూ. 8 వేల చొప్పున జీతమిస్తూ మేనేజర్లుగా నియమించి దక్షిణాఫ్రికాకు వెళ్లారు. యజమానులు సంవత్సరానికి ఒకసారి వచ్చి వ్యాపార లావాదేవీలు, లెక్కలు చూసుకొని వెళ్తుండేవారు. ఈనేపథ్యంలో యజమానులు ఇక్కడ లేకపోవడంతో దంపతులు గత మూడు నెలలుగా పెట్రోలు, డీజిల్ అమ్మగా వచ్చిన డబ్బులను యజమాని ఖాతాకు జమ చేయకుండా కస్టమర్ల నుంచి ఫోన్‌పే ద్వారా తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. గత నెలలో యజమాని గార్లపాటి రంజిత్ కుమార్ ఇండియాకు వచ్చారు. అద్దంకి వచ్చి లెక్కలు చూసుకునేందుకు పెట్రోలు బంకుకు రాగా మేనేజర్లు లేకపోవటంతో అనుమానంతో విచారించారు. తమను మోసగించి రూ. 30 లక్షల మేర వాడుకున్నారని గ్రహించారు. ఇదే కాకుండా తమకు బ్యాంకులో రుణం ఉందని అది విడిపించటానికి గతంలో రూ. 4 లక్షలు కావాలని అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. దీంతో నిందితుల ఇంటికి వెళ్లి గట్టిగా నిలదీయటంతో తమ వద్ద ఏమీ లేవని, నీ ఇష్టం వచ్చింది చేసుకొమ్మని బెదిరించి దాడికి పాల్పడ్డారు. దీంతో యజమానులు అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఈవీఎంలపై బాలినేని ఫిర్యాదుపై రేపే జడ్జిమెంట్

ఒంగోలు: మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసిన బాలినేని శ్రీనివాసరెడ్డి ఈవీఎంలలో ఓట్ల లెక్కింపునకు సంబంధించి హైకోర్టులో చేసిన ఫిర్యాదుపై జడ్జిమెంట్ ఈనెల 28న వెలువడనుంది. ఈమేరకు హైకోర్టులో న్యాయమూర్తి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు కోర్టులో నంబర్ 74గా నమోదైంది. ఈవీఎంలలో నమోదైన ఓట్లకు, వీవీ ప్యాట్లలో నమోదైన ఓట్లకు మధ్య తేడా ఉండి ఉండవచ్చన్న అనుమానం వ్యక్తం చేస్తూ 12 బూత్‌లలో వీవీ ప్యాట్ల స్లిప్పులను లెక్కించాలని బాలినేని ఎన్నికల కమిషన్‌కు డబ్బు కూడా చెల్లించారు. అయితే ఎన్నికల కమిషన్ మాక్ పోలింగ్ నిర్వహించేందుకు ముందుకు రావడం తప్పించి ఎన్నికల సమయంలో వినియోగించిన వీవీ ప్యాట్ల స్లిప్పులను లెక్కించేందుకు అంగీకరించకపోవడంతో బాలినేని హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై బాలినేని తరపున న్యాయవాది ఆలపాటి వివేకానంద ఆగస్టు 17న వాదనలు వినిపించారు. దీనిపై తాజాగా సోమవారం తీర్పు వెలువడనుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.